సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 29 । ఆగస్టు । 2024



సక్రమంగా మెనూ అమలు

సాక్షి, పాడేరు: మధ్యాహ్న భోజన పథకం మెనూను సక్రమంగా అమలుజేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని అల్లివర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. వారి చేతులపై పుండ్లను గమనించిన ఆయన పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించాలని సూచించారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

- ఈనెల 30, వచ్చేనెల 5న నిర్వహణ



ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: వ్యవసాయ విశ్వవిద్యాలయం గుర్తింపు పొందిన ప్రైవేట్ వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలకు ఈనెల 30న, సెప్టెంబర్ 5వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ అప్పలస్వామి తెలిపారు. వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులకు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు జరుగుతుందన్నారు. స్పెషల్ కేటగిరి, చివరి మాన్యువల్, స్పాట్ కౌన్సెలింగ్ అడ్మిషన్లకు ఈనెల 30, సెప్టెంబర్ 5న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరులో జరుగుతుందని తెలిపారు. అడ్మిషన్ సమయంలో ప్రభుత్వం పాలిటెక్నిక్‌లో మొదటి సంవత్సరం సెమిస్టర్‌కు రూ.22,46, అదే అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలో అయితే రూ.27,099 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

చింతూరు సీఐగా దుర్గాప్రసాద్



చింతూరు: స్థానిక సీఐగా తెల్లం దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సీఐడీ కార్యాలయంలో సీఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. గతంలో ఆయన వీఆర్‌పురం, రంపచోడవరం ఎస్ఐగా పనిచేశారు. కాగా ఇప్పటివరకు చింతూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న గజేంద్రకుమార్‌ను వీఆర్‌కు పంపించారు.

టైలరింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన్ స్కీంలో భాగంగా స్వల్పకాలిక కోర్సులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్రావు తెలిపారు. ఆసక్తి గల వారు వచ్చేనెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. టైలరింగ్ కోర్సుకు కాలవ్యవధి మూడు మాసాలు కాగా టెన్త్ చదివిన వారు అర్హులన్నారు. వయసు 16 సంవత్సరాలు పైబడినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9177517373, 9493915401 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గోశాలల నిర్మాణానికి నిధుల మంజూరు

- పశుసంవర్ధకశాఖ ఏడీ చంద్రశేఖర్‌రావు

చింతపల్లి: పశువుల పెంపకానికి సంబంధించి గోశాలల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ పి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతీ మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతుకు సంబంధించి రెండు పశువులు ఉంటే రూ.1.15లక్షలు, నాలుగు నుంచి ఆరు వరకు ఉంటే రూ.1.30 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. అదేవిధంగా 20మేకలు గొర్రెలు ఉంటే రూ.90 వేలు ప్రభుత్వం ఇస్తుందని ఆయన తెలిపారు.

రుణ సౌకర్యం కల్పించాలని ఆందోళన



డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న వెలుగు అధికారులు

అరకులోయ రూరల్: అర్హులైన డ్వాక్రా సంఘాలకు రుణ సౌకర్యం కల్పించాలని సుంకరమెట్ట పంచాయతీ పరిధిలోని పెద్దగంగుడి, దాబుగుడ, సుంకరమెట్ట, పిరిబంద తదితర గ్రామాలకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన సంఘం, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద వారు ఆందోళన చేశారు. గిరిజన సంఘ ప్రతినిధులు చిన్నబాబు, బుజ్జిబాబు, వైఎస్సార్ సీపీ మహిళా నేతలు రాధ, ఆశాలత మాట్లాడారు. తొమ్మిది గ్రామాల పరిధిలోని 137 సంఘాలకు రుణ సౌకర్యం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం శెట్టి అప్పయ్యమ్మ మాట్లాడుతూ అర్హులైన డ్వాక్రా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తామని తెలిపారు. రుణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. కొంతమంది వీవోఏల తప్పిదాల వల్ల రుణాల మంజూరులో ఆలస్యమైందన్నారు. ఇకపై ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



రాత్రి వేళలో భద్రత పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధినిర్వహణలో ముఖ్యంగా నైట్ డ్యూటీలో ఉండే వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి మరింత భద్రత కల్పించాలి. ఆస్పత్రికి రోగుల వెంట వచ్చే వారు కొంత అసహనానికి గురైన సందర్భంలో ఒక్కోసారి దాడులకు తెగబడే పరిస్థితులు ఉంటాయి. నిఘాతో ఇటువంటివి నివారణ సాధ్యం. పోలీసులు/ ఆస్పత్రి కమిటీ సభ్యులు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

– ఎస్. యామిని ప్రియ, వైద్యాధికారి, జడ్డంగి పీహెచ్‌సీ, రాజవొమ్మంగి మండలం



ప్రత్యేక చట్టాలు అవసరం



వైద్యులు, వైద్యసిబ్బందికి పూర్తిస్థాయిలో భద్రత,రక్షణ అంశాలకు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తేవాలి. రోగులకు అత్యవసర వైద్యసేవల సమయంలో వైద్య బృందాలు అంకిత భావంతో విధులు నిర్వహిస్తాయి. వైద్య వృత్తిని సమాజం కూడా గౌరవించాలి. కోలకతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన భవిష్యతులో చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ కె.కృష్ణారావు, సమన్వయకర్త, జిల్లా వైద్యావిధాన పరిషత్, పాడేరు

కాఫీ.. రైతు హ్యాపీ

గత మూడేళ్లుగా కాఫీ దిగుబడులు ఆశాజనకంగా ఉన్నందున గిరి రైతుల మోములో ఆనందం నెలకొంది. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో కాఫీ తోటలు కాపుతో కళకళలాడుతున్నాయి. ఆశించిన దానికన్నా దిగుబడులు పెరిగే అవకాశం ఉన్నందున ఈ ఏడాది మంచి ఆదాయం రావొచ్చని కాఫీ రైతులు ఆశిస్తున్నారు.

- కరుణించిన వరుణుడు
- మూడేళ్లుగా అనుకూలిస్తున్న వాతావరణం
- కాపుతో తోటలు కళకళ
- అక్టోబర్ కల్లా దిగుబడి వచ్చే అవకాశం
- ఈ ఏడాది కూడా మెరుగైన ఆదాయం
- గిరి రైతుల ఆశాభావం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు



మోదాపల్లి ప్రాంతంలో విరగ్గాసిన కాఫీతోటలు



జి.మాడుగుల ప్రాంతంలో కాఫీతోటలను పరిశీలిస్తున్న కాఫీ విభాగం అధికారులు

సాక్షి,పాడేరు: అంతర్జాతీయ స్థాయిలో పేరున్న మన్యం కాఫీతోటలకు ఈఏడాది కూడా వాతావరణ పరిస్థితులు కలొసొచ్చాయి. ఏప్రిల్ నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్న వర్షాలు కాఫీ తోటలకు మేలు చేశాయి. పూత కూడా నెలరోజులు ముందుగానే వచ్చింది. ప్రస్తుతం పిందెలతో కాఫీ పాదలు కళకళలాడుతున్నాయి. అక్టోబర్ నాటికి కాఫీ దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

1.50 లక్షల ఎకరాల్లో ఫలసాయం

జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో గిరిజన రైతులు కేంద్ర కాఫీబోర్డు, పాడేరు ఐటీడీఏల సహకారంతో కాఫీ తోటలు సాగవుతున్నాయి. ఏజెన్సీలో 2.42 లక్షల ఎకరాల మేర కాఫీతోటలు ఉన్నాయి. వీటిలో 1.42 లక్షల ఎకరాల్లో దిగుబడి వస్తోంది. ఈ ఏడాది మరో 8వేల ఎకరాల్లో అదనంగా పూతవచ్చింది. దీంతో ఫలసాయాన్నిచ్చే తోటల విస్తీర్ణం 1.50లక్షల ఎకరాలకు చేరనుంది.

పెరగనున్న దిగుబడి

గత ఏడాది కన్నా ఈఏడాది కాఫీ మొక్కలు పిందెలతో నిండుగా కనిపిస్తున్నాయి. దీంతో దిగుబడి భారీగానే ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. గతేడాది 1.42 లక్షల ఎకరాలకు సంబంధించి 15వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజలను గిరిజన రైతులు విక్రయించారు. ఈ సారి 18 వేల మెట్రిక్ టన్నులకు దిగుబడి చేరే అవకాశం ఉందని పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం అంచనా వేస్తోంది. చీడపీడల ప్రభావం దిగుబడులపై లేకుండే ఉండేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఆశాఖ అధికారులు పరిశీలించారు. చేపట్టాల్సిన సస్యరక్షణపై రైతులకు సూచనలిచ్చారు.

మూడేళ్లుగా మెరుగైన ఆదాయం

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఆర్థికంగా మేలు చేశాయి. మార్కెట్‌లో పోటీతత్వం లేకపోవడంతో దళారి వ్యాపారులు కిలో కాఫీ గింజలను రూ.100 నుంచి రూ.120లోపే కొనుగోలు చేసేవారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం జీసీసీ ఆధ్వర్యంలో కాఫీ గింజల కొనుగోళ్లు చేపట్టింది. పాచ్‌మెంట్ కాఫీకి రికార్డు స్థాయిలో కిలో రూ.280 ధర నిర్ణయించింది. దీంతో దళారులు కూడా అదే ధర చెల్లించాల్సి వచ్చింది. అదే ధరకు జీసీసీ వెయ్యి టన్నులు కొనుగోలు చేయడంతో గిరిజనులకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది.ఈ ఏడాది కూడా 3 వేల టన్నులు కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో జీసీసీ కార్యాచరణ రూపొందించింది.

కాపు బాగుంది



రెండెకరాల్లో కాఫీ పంట సాగు చేస్తున్నాం. మొక్కలకు కాపు అధికంగానే ఉంది. అదేస్థాయిలో దిగుబడి ఉంటుందని ఆశతో ఉన్నాం.గత ఏడాది కాఫీ గింజల అమ్మకాల ద్వారా రూ.80 వేల ఆదాయం వచ్చింది.ఈ సారి మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. వానలు కురవడంతో జూన్ నుంచి మొక్కలకు గింజ కట్టింది.

– మర్రి రాధిక, కాఫీ రైతు, మోదాపల్లి, పాడేరు మండలం

నాణ్యమైన దిగుబడి లక్ష్యం



ఏజెన్సీలో కాఫీ తోటలకు కాపు అధికంగానే ఉంది. పిందె నాణ్యంగా కనిపిస్తోంది. మంచి దిగుబడి సాధించేలా కాఫీ రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తి లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నాం. ఈఏడాది 18వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజల మార్కెటింగ్ జరిగే అవకాశం ఉంది.

– అశోక్, ఏడీ, ఐటీడీఏ కాఫీ విభాగం, పాడేరు

దైవ ఆరాధనతో మానసిక ప్రశాంతత

అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



శ్లాబ్ పనుల ప్రారంభ కార్యక్రమంలో అరకు ఎంపీ తనూజరాణి, చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

పెదబయలు: దైవ ఆరాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, సన్మార్గంలో నడుచుకునేందుకు దోహదపడుతుందని అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. బుధవారం స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో హరిహరపుత్ర అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన శ్లాబ్ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. గురుస్వాముల సేవలను వారు కొనియాడారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో సామాజిక భవన నిర్మాణానికి సుమారు రూ.3 లక్షలు మంజూరు చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, తహసీల్దార్ రంగారావు, ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్ప, ఎంపీటీసీ బొంజుబాబు, వర్తక సంఘం, మోటార్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

265 కిలోల గంజాయి స్వాధీనం

వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది అరెస్టు



గంజాయి కేసుల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు: మోతుగూడెం, చింతూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో బుధవారం వేర్వేరు ఘటనల్లో రూ 13.25 లక్షల విలువైన 265 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వీటికి సంబంధించిన వివరాలను స్థానిక ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా బుధవారం వెల్లడించారు. ఒడిశా నుంచి తెలంగాణకు 20 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న గోదావరిఖనికి చెందిన నిమ్మల మణికంఠను మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మరో ఘటనలో అదే చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి తెలంగాణకు కారులో తరలిస్తున్న 215 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని భువనగిరికి చెందిన ధీరావత్ గణేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. తెలంగాణ ప్రాంతానికి రవాణా చేసేందుకు చింతూరు బస్టాండు వద్ద సిద్ధంగా ఉంచిన 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని చింతూరు మండలానికి చెందిన ఐదుగురు, తెలంగాణకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐలు శ్రీనివాసరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట(విశాఖ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 – 2560414, 2575046 నెంబర్లలో vskpdlsa@yahoo. com, dlsa. vsp@ gmail. comలో సంప్రదించాలని కోరారు.

పర్యాటక ప్రాంతంగా డల్లాపల్లి అభివృద్ధి

- సందర్శకులకు అనువుగా సౌకర్యాలు
- కలెక్టర్ దినేష్‌కుమార్
- రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



డల్లాపల్లిలో వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

సాక్షి,పాడేరు: ఎత్తయిన ప్రదేశంగా గుర్తింపు పొందిన డల్లాపల్లిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి చర్యలు చేపట్టామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మోదకొండమ్మతల్లి పాదాలు జంక్షన్ నుంచి డల్లాపల్లి వరకు నిర్మిస్తున్న 5.50 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపులా మరో 3.75 మీటర్ల మేర విస్తరించి రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన ఈ పనులు నెలరోజుల్లో పూర్తవుతాయన్నారు. డల్లాపల్లిలో ఐదారు హోంస్టేల నిర్మాణాలు, ట్రెక్కింగ్, పారా గ్లేడింగ్ తదితర అడ్వెంచర్ గేమ్‌లు ఏర్పాటుకు ముందుకు వస్తే పరిశీలన జరిపి తగిన సహకారం అందిస్తామన్నారు. వంజంగి మాదరిగానే అధికారితో పాటు గిరిజనులు బృందంగా ఏర్పడి డల్లాపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. వ్యూపాయింట్‌ను పరిశీలించారు. అలాగే వంతాడపల్లి–బూరుగుచట్టు, సప్పిపుట్టు– నారింగపాడు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ రోడ్ల నిర్మాణంతో 1200మంది జనాభా ఉన్న పీవీటీజీ గ్రామాలకు రవాణా పరంగా మేలు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రోడ్డు అంచుల్లో మట్టి వేయకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ అందుకు అవసరమైన పనులు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్, ఎంపీడీవో సాయినవీన్, ఏఈ రాజు పాల్గొన్నారు. తుంపాడ గ్రామంలో అమృత సరోవర్ పథకంలో నిర్మించిన నీలగెడ్డ చెరువు పనులను కలెక్టర్ పరిశీలించారు.

పొలాల్లో జోల్డా వేడుకలు

- ఏజెన్సీలో ఘనంగా పండగ ప్రారంభం
- గ్రామదేవత శంకులమ్మకు పూజలు
- పొలాల్లో ఔషధ గుణాల కొమ్మలను నాటిన గిరి రైతులు
- బంధువులు, స్నేహితులతో విందు



కొత్తపాడేరు గ్రామచావిడిలో శంకుదేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు



వరి పంట భూముల్లో కొమ్మలను నాటేందుకు బయలుదేరిన గిరిజనులు

సాక్షి, పాడేరు: గిరిజన సంప్రదాయ పండగల్లో ఒక్కటైన జోల్డా వేడుకలు మన్యంలోని గ్రామాల్లో బుధవారం మొదలయ్యాయి. అందరి పొలాల్లో వరి నాట్లు పూర్తయిన తరువాత ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీ. వేకువజామున తలకు స్నానాలు చేసిన గిరిజనులు గ్రామ చావిడి వద్ద గ్రామ దేవత శంకులమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. నాటు కోడిన బలిచ్చిన తరువాత ఇంటివద్ద వంటలు చేసిన అనంతరం పొలాలకు వెళ్లి జోల్డా పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల పరిధిలోని సందడి నెలకొంది. పాడేరులో సుండ్రుపుట్టు, లోచలిపుట్టు, గుడివాడ, కొత్త పాడేరు, పాతపాడేరు గ్రామాల్లోని గిరిజనులంతా ఉదయాన్నే వరి పొలాల్లో జోల్డా కొమ్మలను నాటారు. వరి పైరు బాగా పండాలని, చీడపీడలు, క్రిమి కీటకాల ప్రభావం లేకుండా పండగ ఉద్దేశమని వారు తెలిపారు. అడవుల నుంచి సేకరించిన ఔషధ గుణాలున్న, కసిమి, సీత(బరదాపు), పెదజోల్డా చెట్ల కొమ్మలను నాటి ప్రకృతి దేవతకు పూజలు చేయడం వల్ల పైరుకు మంచి జరుగుతుందని వారు పేర్కొన్నారు. పొలాల్లో పూజలు అనంతరం ఇంటి నుంచి తెచ్చిన వంటకాలతో పొలాల వద్ద విందు నిర్వహించారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి ఘనంగా నిర్వహించారు.

విద్య, వైద్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



కిల్లోగుడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ: విద్య, వైద్యసేవల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం తగదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా కిల్లోగుడ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మెనూను సక్రమంగా అమలు చేయాలని డిప్యూటీ వార్డెన్, హెచ్ఎంను ఆదేశించారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. డైనింగ్ హాల్ నిర్మించాలని, సోషల్ టీచర్‌ను నియమించాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అదే ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేశారు.



ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారి విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. దీనిని పాడేరు ఐటీడీఏ రూ.70 లక్షలతో ఆధునికీకరించింది. ప్రకృతి సహజ సిద్ధ అందాలకు నిలయమైన ఈ ప్రాంతాన్ని అలంకరణ పూలమొక్కలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పగోడాలతోపాటు గిరిజనుల థింసా నృత్య ప్రదర్శనకు ఓపెన్ థియేటర్ నిర్మించారు. హట్స్ ఏర్పాటుచేశారు. స్వాగత ద్వారాన్ని ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలతో ఏర్పాటుచేశారు. – డుంబ్రిగుడ

